
## క్లుప్తంగా

### సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు


ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికిమంగళ వారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ మాసం తొలి మంగళ వారం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఇష్టమైన నాగ పంచమి కావడంతో 273 మంది భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో రామలింగ భాస్కర్ పర్యవేక్షించారు.

### అయ్యప్ప స్వామికి అభిషేకం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు కామేష్ ఆధ్వర్యంలో 18 రకాల ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. శ్రావణ మాసం, స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆవు పాలు, నెయ్యి, పెరుగు, విబూది, పన్నీరు, వట్టివేరు, తేనె వంటి ద్రవ్యాలతో అభిషేకం చేశారు. భారీఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### రెండో రోజు క్షేత్ర స్థాయి శిక్షణ


బలభద్రపురంలో శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బిక్కవోలు: ప్రకృతి వ్యవసాయ శిక్షణలో భాగంగా రెండో రోజు మంగళవారం బలభద్రపురం గ్రామంలో క్షేత్ర స్థాయిలో శిక్షణ అందించారు. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన వీఏఏ, వీహెచ్‌సీలకు మూడు రోజుల శిక్షణలో భాగంగా కషాయాల తయారీ, డ్రోన్ ద్వారా కషాయాల పిచికారీపై ప్రయోగాత్మకంగా చూపించారు. నీమాస్త్రాం, అగ్రాస్త్రాం, బీజామృతం, కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారీ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణ మాట్లాడుతూ, కషాయాలు పంటలకు ఎలా ఉపయోగపడతాయో విశదీకరించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు సామ్యూల్ జాన్, సురేష్, శ్రీనివాస్, రామకృష్ణ, హరిషా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ డీలర్లతో సమావేశం

బిక్కవోలు: వేగవంతంగా ఇంటింటికీ రేషన్ సరకులను పంపిణీ చేయాలని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులతో పాటు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించాలన్నారు. మండలంలోని 3,183 కుటుంబాలకు రేషన్ ఇవ్వాల్సి ఉండగా, మూడు రోజుల్లో కేవలం 1,579 కుటుంబాలకు మాత్రమే అందించారన్నారు. మిగిలిన వారికీ వేగంగా పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ తూకంలో తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్‌వో నాగాంజనేయులు, ఎంఎస్‌వో రంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతులపై ఉపాధ్యాయుల ఆందోళన


మల్లంపూడిలో శిక్షణా కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం: శిక్షణ కేంద్రంలో సరైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా బాధిస్తున్నారు. కనీసం తాగేందుకు మంచినీరు కూడా దొరకడం లేదు, అరకొరగానే నీరు సరఫరా అవుతోంది. రాత్రివేళల్లో తరచూ కరెంటు పోతుంది. మారుమూల ప్రాంతం కావడంతో దోమల బాధ ఎక్కువే. సరైన సదుపాయాలు లేకుండా ఇచ్చే శిక్షణతో తమను బాధించడం మినహా ప్రయోజనం ఏముంటుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. గత ఏడెనిమిది ఏళ్లుగా ఈ ఇంజినీరింగ్ కళాశాల మూతపడి ఉండటంతో తలుపులు పాడై, గొళ్లాలు ఊడిపోయి, బాత్‌రూమ్‌ల డోర్లు సరిగా లేవన్నారు. ఈ విధంగా ఉన్న భవనాల్లో చంటిపిల్లలతో వచ్చిన తల్లులు పడుతున్న బాధలు మరింత అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బోధనా సామర్థ్యం పెంపులో భాగంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్ బోధనపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు చెందిన 154 మంది ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు ఇచ్చే శిక్షణా తరగతులు మండలంలోని మల్లంపూడిలో ఉన్న సాయిమాధవి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. రెండో రోజుకే అక్కడ కల్పించిన సదుపాయాలతో ఇమడలేక మంగళవారం రాత్రి ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. ఈ విషయమై కాకినాడ జిల్లా జీసీడీఓ ఉమామహేశ్వరిని వివరణ కోరగా, మౌలిక సదుపాయాల కొరత లేదన్నారు. గ్రామీణ ప్రాంతం కావడంతో మల్లంపూడిలో తరచూ కరెంటు పోతుందని, వాటర్ ట్యాంక్ ఫుల్ కాకపోవడంతో కొంతమేరకు నీటి సమస్య వస్తున్న మాట వాస్తవమేనన్నారు. ఇంతకు మించి సమస్యలు లేవన్నారు.

# చంద్రన్న బీమా.. పేదన్నకు చక్మా..

- ఇప్పటికీ తెరుచుకోని వెబ్‌సైట్
- ఏడాది గడిచినా దరఖాస్తులు స్వీకరించని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ బీమాతో పేదలకు ఆసరా



పెదపూడి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు గుప్పించి.. ఎట్టకేలకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన గడిచినా ఆయా హామీలను మాత్రం నెరవేర్చలేకపోతోంది. పథకాలకు పేర్లు మార్చి.. పేదలకు చక్మా ఇచ్చి.. అరచేతిలో వైకుంఠం చూపుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కనీసం కుటుంబంలో చనిపోయిన వారికి ఇస్తామన్న చంద్రన్న బీమా పథకాన్ని కూడా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో.. కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

**పేరు మార్పుతో సరి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమాగా ఉన్న పేరును చంద్రన్న బీమాగా మార్చి సరిపెట్టుకున్నారు. ఇప్పటి వరకూ చంద్రన్న బీమా పథకం విధివిధానాలనూ ప్రకటించలేదు. సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబాలకు రూ.పది లక్షలు అందిస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టి, ఏడాది సంబరాలు చేసుకున్నారే మినహా బీమా పథకం అమలుపై దృష్టి పెట్టలేదని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో జనాభా, 20 నుంచి 60 ఏళ్లున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.

| మండలం | పురుషులు | స్త్రీలు | జనాభా | 20–60 ఏళ్ల వారు |
|---|---|---|---|---|
| అనపర్తి | 35,386 | 35,456 | 70,842 | 47,784 |
| బిక్కవోలు | 34,765 | 35,469 | 70,234 | 46,580 |
| రంగంపేట | 28,929 | 28,220 | 57,149 | 39,300 |
| పెదపూడి | 35,789 | 35,474 | 71,263 | 47,896 |
| మొత్తం | 1,34,869 | 1,34,619 | 2,69,488 | 1,81,560 |

**పత్తా లేని వెబ్‌సైట్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను తొలగించింది. అప్పటి నుంచి చంద్రన్న బీమా పథకంగా పేరు మార్చినా వెబ్‌సైట్ ప్రారంభించలేదు. మృతి చెందిన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మార్గదర్శకాలను కూడా విడుదల చేయలేదు. బీమా దరఖాస్తులు స్వీకరించేందుకు ఆదేశాలు లేవని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. కుటుంబ యజమానులు, సభ్యులను కోల్పోయిన బాధితులు బీమా ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

**గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..**

ఇలాఉండగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపు, 50 నుంచి 60 ఏళ్లలోపు వారు మృతి చెందితే రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకూ వైఎస్సార్ బీమా మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు ,గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి, అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.పది వేలను అందించే వారు. మిగతా సొమ్ము 15 నుంచి 20 రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాల్లో జమయ్యేది. ఈ బీమా ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించేది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**బీమా మంజూరు చేయాలి**



ఇంట్లో కుటుంబ సభ్యుడు, యజమానిని కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఇచ్చిన హామీ మేరకు బీమా సొమ్మును కూటమి ప్రభుత్వం మంజూరు చేయాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మృతుల కుటుంబాలకు బీమా సొమ్ము ఖాతాల్లోకి జమ చేసి ప్రజలకు అండగా ఉండేది. కూటమి ప్రభుత్వం వెంటనే ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేసి, మృతుల కుటుంబాలకు బీమా మంజూరు చేయాలి.

– సొంబత్తుల చంటి, ఎస్సీ సెల్ కన్వీనర్, వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం, కాండ్రేగుల గ్రామం

## ఘనంగా శ్రావణ మంగళవారం పూజలు


పందలపాకలోని రేవులో గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు


ముగ్గళ్లలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు

బిక్కవోలు: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున మహిళలు కాలువలకు వెళ్లి పుణ్యస్నానాలు చేశారు. సామూహిక కుంకుమ పూజలు, మంగళగౌరీ వ్రతం తదితర పూజలు నిర్వహించారు. బిక్కవోలు, బలభద్రపురం, కొమరిపాలెం, పందలపాక గౌరీశంకరులు, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల వద్ద ఉన్న స్నానాల రేవుల్లో, కొంకుదురు బుడతల మామిడి వద్ద త్రిముఖ లింగేశ్వరుని ఆలయంలోని పుష్కరిణి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ముత్తయిదువులను ఇళ్లకు ఆహ్వానించి వాయినాలు అందించారు.

**పలు ఆలయాల్లో..**

సీతానగరం: శ్రావణ మంగళవారం కావడంతో మండలంలోని పలు ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. మంగళగౌరీ వ్రతం, నాగుల పంచమి, గరుడ పంచమి సందర్భంగా ముగ్గళ్లలోని ఉమా కొమరేశ్వర స్వామివారి ఆలయం, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయాల్లో అర్చకులు కొడమంచిలి విజయ్, కొడమంచిలి వినేష్ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించారు. సీతానగరం ఉమారామలింగేశ్వర స్వామి వార్లను, రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివార్లకు అర్చకులు కొడమంచిలి రాంబాబు, నాగార్జునశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలి

డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి


పైన గ్రామంలో అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలని, దీనిని ఎక్కువగా వినియోగిస్తే మానవాళికి ముప్పు తప్పదని డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. పైన గ్రామంలో మంగళవారం ఉదయం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో ప్రతిరోజు ఉదయం క్లాప్ మిత్రాలకు ప్రజలు తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలని కోరారు. క్లాప్ మిత్రాల చెత్త సేకరణ పనులు పరిశీలించారు. అలాగే మహిళలు తడి, పొడి చెత్తను డస్ట్‌బిన్లలో వేసి, క్లాప్ మిత్రాలకు అందించేలా చైతన్యం పెంచుకోవాలన్నారు. దీనిపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరపల్లి ప్రమీల, సచివాలయ కార్యదర్శి వర్మ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేతో కచ్చితమైన సరిహద్దుల గుర్తింపు


ములకల్లంక గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: రైతులకు చెందిన భూముల కచ్చితమైన హద్దుల గుర్తింపు కోసమే రీ సర్వే అని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కాటవరం, ములకల్లంక పంచాయతీల వద్ద రీ సర్వే గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీ సర్వే రైతులకు ఎంతో ఉపయోగకరమని, చనిపోయిన భూ యజమానుల వారసుల పేరున మార్చుకోవడానికి, అలాగే కొనుగోలు చేసిన భూమిని వారి పేరున మార్చుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. సంబంధిత రికార్డులు అధికారులకు అందించాలన్నారు. రీ సర్వే తేదీని నోటీసుల ద్వారా తెలుపుతామన్నారు. రైతులు తమ వెంట భూమి రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా, ఆధార్ జిరాక్స్ కాపీలు, రైతు సెల్‌ఫోన్ నంబరును వీఆర్‌ఓకు అంజేయాలన్నారు. రీ సర్వే టీమ్ సంబంధిత రైతు సమక్షంలో భూమి డాక్యుమెంట్ల ప్రకారం సర్వే చేసి, భూమి వాస్తవ పరిస్థితిని నిర్ధారిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ మూర్తి, మండల సర్వేయర్ గౌతమ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## పంటల బీమా చేయించుకోవాలి

కాకినాడ ఏడీఏ దుర్గాలక్ష్మి


శహపురంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ దుర్గాలక్ష్మి

పెదపూడి: రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ ఏడీఏ దుర్గాలక్ష్మి అన్నారు. శహపురం గ్రామంలో ఎంఏఓ ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాలక్ష్మి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఎకరాకు రూ.769 చెల్లిస్తే బీమా నమోదవుతుందన్నారు. ప్రతి రైతు ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతు సేవా కేంద్రాల్లో ఈ–పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పొలం గట్లపై పండించడానికి రైతులకు కందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే ఫాస్ఫరస్, పొటాష్, ఎరువులు, జీవన ఎరువులు, నానో డీఏపీ, నానో యూరియా, వాటి ప్రాధాన్యాన్ని రైతులకు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనుం శాంతకుమారి, వ్యవసాయ సహాయకుడు డి.చాంద్ మొహమ్మద్, రైతులు పాల్గొన్నారు.

## రఘుదేవపురం రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఇంపాక్ట్


రఘుదేవపురం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు జరుగుతున్న మరమ్మతులు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం–సీతానగరం రోడ్డులో ఉన్న గోతులకు అధికార యంత్రాంగం ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టింది. 'నడ్డి విరిచే రోడ్డు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వెలువడిన కథనానికి ప్రభుత్వాధికారులు స్పందించారు. రఘుదేవపురం–సీతానగరం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారిందని, దీనికి మోక్షం ఎప్పుడు దొరుకుతుందోనని వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ కథనంలో ప్రస్తావించారు. కాతేరు–సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు మంజూరై, రఘుదేవపురం శివారు వరకు రోడ్డు పూర్తయినా, అక్కడి నుంచి సీతానగరం వరకు రెండు కిలోమీటర్లు రోడ్డు నిర్మించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని, రోడ్డుపై భారీ గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని కథనంలో పేర్కొనడం జరిగింది. దీనికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు రఘుదేవపురం నుంచి పొక్లెయిన్‌తో రోడ్డును తవ్వి, రోలర్‌తో చదును చేయిస్తున్నారు. గోతులు లేకుండా, వాహనాల రాకపోకలు సజావుగా సాగడానికి మరమ్మతులు చేపట్టారు. తొర్రేడు వద్ద విద్యుత్ స్తంభాల పనులు చేపట్టామని ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. త్వరలో రఘుదేవపురం శివారు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సిమెంట్ రోడ్డు నిర్మిస్తామని, అక్కడి నుంచి పెట్రోల్ బంక్ వరకు బీటీ రోడ్డు నిర్మించనున్నట్టు చెప్పారు. త్వరలో పనులు చేపడతామన్నారు.

## వైఎస్సార్ సీపీ నేత చిన్నబుజ్జి మృతి

- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఇతర నేతల సంతాపం


సత్తి సత్తిరెడ్డి (ఫైల్)

అనపర్తి: కొత్తూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సత్తి సత్తిరెడ్డి (చిన్న బుజ్జి)(49) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో తన నివాసంలో మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన తండ్రి సత్తి గంగిరెడ్డి, సోదరుడు పెద్ద బుజ్జితో పాటు, చినబుజ్జి పార్టీ అభివృద్ధికి, విజయానికి అహర్నిశలు శ్రమించారు. కాంట్రాక్టర్‌గా కొత్తూరు, అనపర్తి అభివృద్ధిలో చిన్న బుజ్జి ఎనలేని కృషి చేశారు. సొంత ఖర్చుతో కొత్తూరు కాలనీలో గుడి నిర్మాణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలూ నిర్వహించారు.

**పార్టీకి తీరని లోటు**

చిన్న బుజ్జి మృతి పార్టీకి తీరని లోటని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. చినబుజ్జి మృతికి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, పార్టీ మండల అధ్యక్షుడు సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, అనపర్తి పీఏసీఎస్ చైర్మన్ రామన్న తాత, పొలమూరు మాజీ సర్పంచ్ మేడపాటి గంగిరెడ్డి, సత్తి వెంకటరెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

## తాగునీటి కార్మికులపై కనికరం లేదా?


పోలినాటి ఈశ్వరుడు

సీతానగరం: ప్రజల కష్టాలు పట్టించుకోవడం ప్రభుత్వ కర్తవ్యమని, సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికులు రోజుల తరబడి సమ్మె చేస్తున్నా ఇంత వరకూ కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 19 నెలల జీతాలు అందించాలంటూ రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వద్ద ప్రాజెక్టు వర్కర్లు సమ్మె బాట పట్టి, 20 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు కానీ, ప్రభుత్వ పెద్దలు కానీ వారిపై కనికరం చూపడం లేదని, అసలు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. దేవీపట్నం, గోకవరం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని 90 గ్రామాలకు తాగునీరు లేక సుమారు మూడున్నర లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. సుదూర ప్రాంతాల్లోని ఆర్‌ఓ ప్లాంట్ల నుంచి డ్రమ్ములు, క్యాన్లు, ప్లాస్టిక్ టిన్నులు, ట్యూబ్‌ల్లో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లపై తాగునీటిని తీసుకెళుతున్నారని తెలిపారు. ప్రజలకు శుద్ధి చేసిన గోదావరి జలాలు అందక కష్టాలు పడుతున్నారని, తక్షణమే ప్రాజెక్టు కార్మికులకు జీతాలు అందించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

## బాలల సంరక్షణకు కృషి చేయాలి

జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు


పెదపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీఓ

పెదపూడి: మండల, గ్రామ స్థాయి కమిటీలు బాలల సంరక్షణకు కృషి చేయాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ వాత్సల్య పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ సీవీవీ సత్యనారాయణ, డీసీహెచ్‌ఎల్ ఆఫీసర్ కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, మిషన్ వాత్సల్య పథకంలో 18 ఏళ్లలోపు బాలబాలికల సంరక్షణ, వారి చట్టాలు, అభివృద్ధిపై అవగాహన కల్పించారు. జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలన్నారు. బాల్య వివాహాల చట్టాలు, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు శ్రీపద్మ, అరుణశ్రీ, జానకి, హెచ్‌ఎంలు, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**మానవ అక్రమ రవాణాపై అవగాహన**

కోరుకొండ: మానవ అక్రమ రవాణాను నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని క్రాఫ్ కమ్యూనిటీ సోషల్‌వర్కర్ లిల్లీ క్వీన్ అన్నారు. మంగళవారం కోరుకొండ బస్టాండ్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఈ నెల 15 నుంచి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

### కాపవరంలో తహసీల్దార్ విచారణ


కాపవరంలో విచారణ చేస్తున్న తహసీల్దార్ కృష్ణ

బిక్కవోలు: మండలంలోని కాపవరం గ్రామంలో తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ మంగళవారం విచారణ నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ విచారణ చేపట్టారు. కాపవరం గ్రామంలోని అనదాసు మణి తన భూమి 22ఏ పరిధిలోకి వచ్చిందని ఫిర్యాదు ఇవ్వడంతో, అతని భూమిని క్షేత్ర స్థాయిలో, రికార్డులను పరిశీలించారు. అలాగే గెద్దం దావిద్ ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేయడంతో.. వారున్న ఇంటిని పరిశీలించారు. ప్రస్తుతం 1.5 సెంట్ల భూమి ఇచ్చి, పూర్తి స్థాయిలో ప్రభుత్వం కట్టించి ఇస్తుందని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వో వీరబాబు తదితరులు ఉన్నారు.

### రైతుల సమ్మతితో భూములు సేకరించాలి


కంటే వీరవెంకట సత్యనారాయణ

కోరుకొండ: మధురపూడి విమానాశ్రయం సమీపంలో వైమానిక దళ భవనాల నిర్మాణం కోసం జరుగుతున్న భూ సేకరణ కార్యక్రమాన్ని ప్రజాభిప్రాయ సేకరణ ద్వారానే చేపట్టాలని రైతు సంఘం నాయకుడు, బూరుగుపూడి మాజీ సర్పంచ్ కంటే వీరవెంకట సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, విమానాశ్రయం సమీపంలో వైమానిక దళ భవనాల ఏర్పాటుకు బూరుగుపూడి, గుమ్ములూరు గ్రామాల్లో 14 నుంచి 17 ఎకరాల భూములను సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దీనికి సంబంధించి భూ సేకరణను రైతుల సమ్మతి, అభిప్రాయాల ఆధారంగా నిర్వహించాలన్నారు. అలాగే 2018లో విమానాశ్రయం విస్తరణ కోసం భూములిచ్చిన రైతులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. భూ సేకరణ వల్ల కొందరు రైతులు భూములను కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. ముందు ఇచ్చిన రైతుల నుంచి కాకుండా, మిగిలిన వారి భూములను సేకరించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం


నిందితుడు, మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అనపర్తి మండలం పొలమూరు గ్రామంలో నిర్వహించిన దాడుల్లో బెల్టు షాపుల్లో అక్రమంగా విక్రయిస్తున్న 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అలాగే చంద్రమళ్ల మల్లేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా దొడ్డిగుంట గ్రామంలో నిర్వహించిన దాడుల్లో పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఓ మహిళను అరెస్టు చేసినట్టు తెలిపారు.

### ఇన్‌చార్జి ఎంపీడీవోగా నాగేంద్రప్రసాద్

బిక్కవోలు: మండలంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా పరిపాలనాధికారి ఎస్ నాగేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఎంపీడీవో శ్రీనివాస్ నెల రోజుల పాటు సామర్లకోటలో శిక్షణ కార్యక్రమానికి హాజరవుతున్నట్టు చెప్పారు. మండలంలోని అభివృద్ధి పనుల్లో ఇబ్బందులు కలగకుండా ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు.

### ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా రైతులు ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. స్థానిక మహాకాళేశ్వర ఆలయం ఎదురుగా ఉన్న అరుణా ప్యాలెస్‌లో ప్రకృతి వ్యవసాయంపై రాజమహేంద్రవరం సబ్ డివిజన్ పరిధిలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా శిబిరం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, ఇందులో భాగంగా రూపొందించిన 9 సహజ వ్యవసాయ సూత్రాలను రైతులకు వివరించాలన్నారు. ఏటీఎం పెరటి తోటలు, ఏ–గ్రేడ్ మోడల్‌లో వివిధ పంటల సాగుపై మెళకువలు విశదీకరించారు. జిల్లాలో రసాయన ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గించే దిశగా రైతులను చైతన్యపరచి, ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడుతూ, పలు పంటల్లో శాస్త్రవేత్తల పరిశోధనల సిఫార్సుకు అనుగుణంగా సమగ్రమైన సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ, వరి సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు. ప్రకృతి వ్యవసాయ పథక సంచాలకుడు తాతారావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామ లక్ష్మి, రాజమహేంద్రవరం వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికార్లు పాల్గొన్నారు.